

నీట్‌లో గురుశేఖర్‌రెడ్డికి 68వ ర్యాంక్



ప్రజాశక్తి-చాపాడు

నీట్ ఫలితాలలో ఆల్ ఇండియా స్థాయిలో మండల పరిధిలోని మదూరు గ్రామానికి చెందిన దేవగుడి గురుశేఖర్‌రెడ్డి 720/710 మార్కులు సాధించి 68వ ర్యాంక్ సాధించాడు. ఇంటర్మీడియట్‌లో బైపిపిలో 988 మార్కులు సాధించాడు. గురుశేఖర్‌రెడ్డి రైతు కుటుంబానికి చెందిన మల్లేశ్వర్‌రెడ్డి కుమారుడు. గురుశేఖర్ రెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 68వ ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలుపుతున్నారు.

'కొప్పర్తి' పైప్‌లైన్‌పై కమిటీ



నిరుపయోగంగా ఉన్న పైపులు (ఫైల్ ఫోటో)

ఇంజినీరింగ్ నిపుణులతో అధ్యయనం
బ్రహ్మసాగర్ నీటి సరఫరా పనులకు మళ్లింపు?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

సోమశిల నుంచి కొప్పర్తి నీటి సరఫరా పైప్‌లైన్ పైపుల తరలింపునకు రంగం సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ హయాంలోని రూ.450 కోట్లు పైప్‌లైన్ పనులకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ మేరకు కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ పైప్‌లైన్ అలైన్‌మెంట్ పొడవునా 2.4 డయాఫ్రమ్ వాల్ సామర్థ్యంతో కూడిన పనులను ఏర్పాటు చేశారు. వైఎస్ఆర్ అనంతర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పైప్‌లైన్ పనుల్లో కదలిక లేకుండా పోయింది. ఇటీవలి కాలంలో కొప్పర్తి పారిశ్రామిక వాడలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు పెరిగిన నేపథ్యంలో వృథాగా పడి ఉన్న పైప్‌లైన్ పైపులను ఇతర ప్రాంతాలకు తరలించాలనే ఉద్దేశంతో ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ, కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్, జాయింట్ కలెక్టర్‌లతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇంజినీరింగ్ ఇన్‌ఛీఫ్ నారాయణరెడ్డి సోమశిల ఎత్తిపోతల పనులను పరిశీలించినట్లు తెలిసింది. కొప్పర్తి పారిశ్రామికవాడకు పరిశ్రమల తాకిడి పెరిగిన నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం నీటి సరఫరా కల్ప నపై దృష్టి సారించింది. 33 కిలోమీటర్ల మేర 800 మిల్లీమీటర్ల డయా మీటర్ల వ్యాసార్ధం కలిగిన పైప్‌లైన్‌ల ద్వారా 480 మిలియన్ లీటర్ ఫర్‌డే (ఎంఎల్‌డి) నీటిని సరఫరా నిమిత్తం రూపకల్పన చేయడం తెలిసిందే. ఇందులో 1460 ఎంఎల్‌డి సామర్థ్యం కలిగిన సమ్మర్ స్టోరేజీ సంప్ పను లను చేపట్టనున్నట్లు తెలుస్తోంది. తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన బ్రహ్మసాగర్ రిజర్వాయర్ నుంచి ఆర్‌టిపిపికి పైప్‌లైన్‌లతో నీటిని సర ఫరా చేయాలని ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆర్‌టిపిపితో అవగాహన కుదుర్చుకుని తాత్కాలిక ప్రాతిపదికన నీటి సరఫరా పైప్‌లైన్‌కు సోమశిల ఎత్తిపోతల పనుల పైపులను తరలించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒంటిమిట్ట అవతలి ప్రాంతం నుంచి కడప జిల్లా కేంద్రానికి సమీపం వరకు సుమారు 30 కిలోమీటర్ల పొడవునా నిరుపయోగంగా పడి ఉన్న ఖరీదైన పైపులను ఉపయోగంలోకి వస్తే ప్రజాధనాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉండేదని చెప్పవచ్చు. దీనిపై ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఇ శ్రీనివాసులను ఫోన్‌లో పలుమార్లు సంప్రదించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారంచాలని కలెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి విసి ద్వారా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్నకు చేబుదాం, అర్జీలు, గడప గడపకూ మన ప్రభుత్వం, ఎన్ఆర్ఇజిఎస్ పనుల పురోగతి, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా గృహనిర్మాణ పథకం అమలు తీరు, జగనన్న భూ హక్కు-భూ రక్ష పథకం, నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాలల అభివృద్ధి, సచివాలయ సేవలు తదితర అంశాల్లో ఇప్పటి వరకు సాధించిన పురోగతి మొదలైన అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించి దిశానిర్దేశం చేశారు. విసి అనంతరం కలెక్టర్ అధికారుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు అధికారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విధిగా లక్ష్యాల సాధనకు అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ప్రారంభించిన 'జగనన్నకు చేబుదాం కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా, అత్యంత నాణ్యమైన, సంతృప్త స్థాయిలో పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఏకకాల సమయంలోనే ప్రజల నుండి వినతిని స్వీకరించడం, అందుకు సంబంధించిన ఆమోదయోగ్యమైన అంశాలను పరిగణలోకి తీసుకుని పరిష్కరించడం జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియను ముఖ్యమంత్రి స్వీయ పరిశీలనలో సిఎంవో స్థాయి నుండి నేరుగా సచివాలయాల పరిధిలో పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రజల చంతకే వెళ్లి నేరుగా ప్రజల సమస్యలను గుర్తించి, వారికి అవసరమైన సదుపాయాల కల్పనను ప్రతిపాదనలు పంపాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో పనిదినాలను ప్రభుత్వ లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సచివాలయ, ఆర్‌బికెలు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్స్, డిజిటల్ లైబ్రరీలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణ పనులను పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఆర్‌బికె పరిధిలో రైతులకు సాగుబడికి అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, మందులు స్టాకు ఉండేలా ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల కట్టడి చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌పి అన్బురాజన్, జెసి గణేష్‌కుమార్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్, సిపిఒ వెంకట్రావు, డిఆర్‌డిఎ, హౌసింగ్, డ్వామా పీడీలు ఆనంద్ నాయక్, కృష్ణయ్య, యదుభూషన్‌రెడ్డి, పిఆర్, ఆర్అండ్‌బి ఎస్ఇలు శ్రీనివాసులురెడ్డి, మహేశ్వర రెడ్డి, ల్యాండ్స్ సర్వే, రిజిస్ట్రేషన్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంబందిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామారావు

ఆర్‌డిఒను చుట్టుముట్టిన రైతులు

- భూములకు నష్టపరిహారం పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-చాపాడు

నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే అనుసంధాన రోడ్డు కు భూములు కోల్పోతున్న రైతులు నష్టపరిహారం పెంచి ఇవ్వాలని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు ను చుట్టుముట్టారు. బుధవారం బద్రి పల్లె, పిచ్చపాడు గ్రామాలకు చెందిన రైతులతో ఆర్డీఓ సమావేశాన్ని నిర్వహించారు. పిచ్చ పాడు గ్రామ రైతులకు రూ. 15 లక్షలు నష్టపరిహారం అందుతుందని ఆర్డీఓ సూచించారు. నేషనల్ హైవే పూర్తిగా కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉందని నష్టపరిహారం పెంచడం తమ పరిధిలో ఉందన్నారు. బహిరంగ మార్కెట్ లో రూ. కోటి వరకు ధర పలుకుతుందని ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదని ఆర్డిఓను రైతులు చుట్టుమట్టారు. రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు తెలియజేయాలని రైతుల కోరారు. అర్జీ రూపంలో రైతులు అందజేస్తే ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేస్తామని ఆర్డీఓ రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, సర్వేయర్ స్నేహ లత, వి ఆర్ ఓ సుబ్బన్న, రెవిన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒను చుట్టుముట్టిన రైతులు

18న విద్యుత్ రంగ సంస్కరణలపై సదస్సు : సిపిఎం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యుత్ రంగ సంస్కరణలపై ఈనెల 18న కడప నగరంలో పాత బస్టాండ్‌లో వున్న సిపిఎం కార్యాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సదస్సును విజయవంతం చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని పాత బస్టాండ్, 7రోడ్ల కూడలి, 1 టౌన్ పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపుపై పెద్ద ఎత్తున పోరాటాలు జరిగాయని, దాని ఫలితంగా చాలా సంవత్సరాలు విద్యుత్ ఛార్జీల భారం ప్రజానీకం మీద పెద్దగా వేయలేదన్నారు. ప్రస్తుతం మళ్ళీ జూన్‌లో విద్యుత్ ఛార్జీల భారం ఎక్కువగా ఉందన్నారు. గతంలో అనేక రకాల పోరాటాలు చేశారని మళ్ళీ అలాంటి పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. విద్యుత్ రంగంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు, ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు బిగించి అదనపు భారాలను మోపడానికి సిద్ధమైందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం చేసేందుకు వీలుగా సదస్సు జరుపుతున్నామని, ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా కర్నూల్ మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్, సిపిఎ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నేతలు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు మహబూబ్ తార, ఎమ్మార్ నాయక్, విజయ్, చంద్ర పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

విఆర్ఎల సమస్యలపై ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ప్రధాన కార్యదర్శి మనోహర్ కోరారు. బుధవారం ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విఆర్ఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అర్హులైన విఆర్ఒలకు పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విఆర్ఎల జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ, అశోక్, జిల్లా కోశాధికారి వెంకట సుబ్బయ్య సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

చెన్నూరులో ఆధార్ కేంద్రం ఏర్పాటు

చెన్నూరు: పట్టణంలోని మూడో సచివాలయంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సురేష్ బాబు కోరారు. ఆధార్ కేంద్రంలో అన్ని సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఆధార్ కార్డులో పేరు సవరించడం, చిరునామా మార్చడం, ఆధార్ అప్డేట్ చేయడం వంటి, ఫోటో మార్చడం ఇంకా అనేక ఉచిత సేవలు అందుతాయని మండల ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదానం

కడప: రక్తదాత దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శ్యామల దేవి ఆధ్వర్యంలో బుధవారం బోగపార్వతమ్మ రక్తనిధిలో పదిమంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో నజీర్ అహ్మద్, బండి జకరయ్య, సత్తార్, ప్రసాద్ గౌడ్, ఇల్లూరి కృష్ణారెడ్డి, విజయ భాస్కర్, అరుపుల్లా, నాగలక్ష్మి, సత్యం,యోహాన్,శరత్ బాబు,అరుణ్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపి, వైసిపి రెండు దొంగ పార్టీలే : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

బిజెపి, వైసిపి రెండు దొంగ పార్టీలేనని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విశాఖలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా జగన్ పాలనలో అవినీతి తప్ప మరేమీ కనిపించటం లేదన్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలపై జగన్ బొమ్మ వేసుకొని సొంత ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షల కోట్లు ఇచ్చినా డబ్బుకు సరిపడా అభివృద్ధి లేదని, వైసీపీ నాయకులకు భూరాబంధుల కేంద్రంగా ఏపీ ప్రభుత్వం తయారైందని అన్నారన్నారు. ఇంత తీవ్రంగా విమర్శించినా తేలు కుట్టిన దొంగల్లాగా వైసిపి నాయకులు ఈ ఆరోపణలను ఖండిస్తూ ఒక్క మాట కూడా ఎవరూ మాట్లాడలేదని పేర్కొన్నారు. బిజెపి, వైసిపి రెండు పార్టీల ప్రభుత్వాలు దొంగలే అన్న విషయం ప్రజలకు సుస్పష్టమవుతోందన్నారు.



మాట్లాడుతున్న ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్ దార్లు సిపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, కాంట్రాక్టు, కంటింజెంటు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల దీర్ఘకాలిక, ప్రస్తుత సమస్యలు పరిష్కారానికి, హక్కుల సాధనకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు ఆర్కె సూర్యనారాయణ, ఆస్కారరావు ఆధ్వర్యంలో రాష్ట్ర శాఖ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆర్‌టిసి బస్సు స్టాండ్ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశామని చెప్పారు. 1వ తేదీనే జీతాలు,పింఛన్లు ఇవ్వాలని, కనీసం 2019 వరకు నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, కంటింజెంటు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎ లు ఎప్పటికప్పుడు విడుదల చేయాలని, పిఆర్‌సి కమిషన్‌తో సంబంధం లేకుండా 11వ పిఆర్సి విధముగానే అధికారుల కమిటీ వేసి 12వ పిఆర్సి ప్రకటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రఘు రామ నాయుడు, జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగశేషుడు, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, ప్రసాద్ గౌడ్, మార్క్ సుమిత్ర, మరియాకుమారి,లోచర్ల శ్రీనివాసరావు లిజిల్లా సంయుక్త కార్యదర్సులు, కడప పట్టణ అధ్యక్ష కార్యదర్సులు కృష్ణప్రసాద్, నాగరాజు, తదితర కార్యవర్గ సభ్యులు రామాంజలురెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇఎపిసెట్‌లో భార్గవనందన్‌రెడ్డికి 13వ ర్యాంక్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



ఎపి ఇఎపిసెట్ ఇంజినీరింగ్ ఫలితాల్లో పి.బొమ్మేపల్లి గ్రామానికి చెందిన కర్రు భార్గవ నందన్‌రెడ్డి రాష్ట్రంలో 13వ ర్యాంక్ సాధించాడని తండ్రి కర్రు సంజీవరెడ్డి తెలిపారు. ఎపి ఇఎపిసెట్‌లో 160 మార్కులకు 152 మార్కులు సాదించారన్నారు. మొన్న తెలంగాణ ఎంసెట్‌లో స్టేట్ 23వ ర్యాంకు రాగా, ఎపిలో 13వ ర్యాంకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధువులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారన్నారు.

ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

విద్యాశాఖ ఆదేశాలను అమలు చేయని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. బుధవారం అంబేద్కర్ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఉన్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా అక్రమ సంపాదనే ధ్యేయంగా వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ, పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూ, టై వంటి స్టేషనరీ అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నాయని పేర్కొన్నారు. ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో పెట్టకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ, కనీస సౌకర్యాలు కూడా లేకుండా పాఠశాల నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్స్ సమయంలోనే సగం ఫీజు కట్టాలని ఒత్తిడి చేస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోకుండా మామూళ్ల మత్తులో కొమ్ముకాస్తున్నారని తెలిపారు. విద్యాశాఖ ఆదేశాలను పాటించని విద్యాసంస్థపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, లోకేష్ పాల్గొన్నారు.



సివిల్స్ ర్యాంకర్ పవన్ దత్తాను సన్మానిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

సివిల్స్ ర్యాంకర్ పవన్ దత్తాకు సన్మానం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఇటీవల ప్రకటించిన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో 22వ జాతీయ ర్యాంకు సాధించిన పవన్ దత్తా ఎల్ఐసి కుటుంబ సభ్యులు కావడం తమకు గర్వకారణమని కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. బుధవారం డివిజనల్ కార్యాలయంలో హైదరాబాద్ జోనల్ కార్యాలయ ప్రతినిధి, ఆఫీస్ సేవల కార్యదర్శి సూర్యనారాయణతో కలిసి ఆయన సివిల్స్ విజేతను అభినందించారు. రాజంపేట ఎల్ఐసి శాఖలో పాలనాధికారిగా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు తనయుడు పవన్ దత్తా వైద్య వృత్తిలో ఉన్న అసాధారణమైన అవకాశాలను వదులుకొని ప్రజలకు, సమాజానికి, దేశానికి ఒక ఐఎఎస్ అధికారిగా మిన్నగా సేవలు చేయిచ్చన్న ఉదాత్తమైన తలంపుతో ఐఎఎస్‌ను కెరీర్‌గా ఎంచుకోవడం ఆదర్శప్రాయమన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత పవన్ దత్తా మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థ తమ కుటుంబానికి జీవితంలో ఎన్నో అవకాశాలు ఇచ్చిందని, తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ స్థాయికి చేరుకోవడం సాధ్యమైందని అన్నారు. భారతదేశం అమృత్ కాల్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో, అనేక సంస్కరణలు అన్ని రంగాల్లో చోటు చేసుకుంటాయన్నారు. ఈ మార్పులకు అనుగుణంగా మనం రూపాంతరం చెందాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు చంద్రపాల్, రఘునాథరెడ్డి, ఆనందరావు తదితరులు పవన్ దత్తా సాధించిన విజయాన్ని అభినందిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో పవన్ దత్తా తండ్రి జి.వెంకటేశ్వర్లు, సోదరుడు కార్తవీర్య, పర్సనల్ మేనేజర్ సత్య శ్రీనివాస్, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్, అధికారులు లక్ష్మీనారాయణరెడ్డి, మునెయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వరం జగనన్న విద్యా కానుక

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఒక వరమని జడ్‌పిటిసి నరేన్ రామంజులరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జె.కొత్తపల్లెలో జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూల్ పిల్లలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం చదువులో రాణించేందుకు జగనన్న విద్యా కానుక తోడ్పడుతుందన్నారు. ఈ విద్యాకానుక కింద బడులు తెరిచిన తొలిరోజే ప్రతి విద్యార్థికీ ఉచితంగా 3 జతల యూనిఫాం క్లాత్ ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగు, పాఠ్యపుస్తకాలు, 1వ తరగతికి పిక్టోరియల్ డిక్షనరీలు, 6వ తరగతికి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు తెలుగు డిక్షనరీని ప్రభుత్వం అందిస్తుం దన్నారు. ఈ విద్యాకానుకను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకట్రాంరెడ్డి, ఎంపిపి ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కో-కన్వీనర్ కళాయాదవ్, ఉప సర్పంచ్ మల్లి మండలంలోని సర్పంచులు, ఏపీఎం వేణు గోపాల్ రెడ్డి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి రామాంజులరెడ్డి

అటవీ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి - కడప

అటవీ సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికడుతూనే వన్యప్రాణులను కూడా సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఏర్పాటు చేసిన జిల్లా అటవీ సంరక్షణ పరిరక్షణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, డిఎఫ్ఒ సందీప్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ కృష్ణారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణ, చెట్లను అధికంగా నాటడం వంటి చర్యలు వాతావరణ కాలుష్యం, నీటి కొరత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టే అత్యంత ప్రాధాన్యమైన అంశాలన్నారు. అటవీ సంపదను,భూములను కాపాడటం, వన్యప్రాణులను సంరక్షించడం మనందరి బాధ్యతన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎర్రచందనం సంపదకు నెలావైన.. మన జిల్లాలోని అడవులను జాగ్రత్తగా కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం జిల్లా అటవీ శాఖ, పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని అన్నారు. ముఖ్యంగా జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎర్రచందనం స్మగ్లర్లు ప్రవేశిస్తున్న మార్గాలను గుర్తిస్తూ ఆయా సరిహద్దు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు బేస్ క్యాంపుల నిర్వహణను మార్పు చేస్తుండాలని ఆదేశించారు. అటవీ సంపద సంరక్షణలో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టీముల ద్వారా కూంబింగ్ చర్యలను చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వేలో అటవీ శాఖ భాగస్వామ్యమై రెవెన్యూ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలను సూచించారు. ప్రయివేటు, ప్రభుత్వ స్కూల్ యాజమాన్యలను భాగస్వామ్యం చేస్తూ ఎకో క్లబ్ లను ఏర్పాటు చేయాలని విద్యా శాఖ ను ఆదేశించారు. కడప నగర సమీపంలో ఒక నగర వనం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అటవీ సంరక్షణతో పాటు, వన్య ప్రాణుల సంరక్షించడం మన బాధ్యత అని.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో..కడప ఆర్డీవో ధర్మ చంద్రా రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు, పులివెందుల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ మల్లికార్జున రెడ్డి,సర్వశిక్షా అభియాన్ ఎపిసి ప్రభాకర్ రెడ్డి, టూరిజం ఆఫీసర్ మల్లికార్జున,సామాజిక అటవీ అధికారి, కడప అటవీ స్క్వాడ్ ఆఫీసర్, జిల్లా ఫిషరీస్ శాఖ, ట్రైనీ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ప్రజాశక్తి - వేంపల్లె


కిట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీర్చిదిద్దుతున్నారని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మీగాయత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జడ్‌పిటిసి, ఎంపిపి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక ఇవ్వడం సంతోషకరమన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం అమ్మవడి, జగనన్న దీవెన, జగనన్న విద్యకానుక, జగనన్న వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, ఎంపిటిసి భారతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొట్టిపాడులో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - కొండాపురం


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మండలంలోని పొట్టిపాడు గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకుడు చింతా రాజారెడ్డి, నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు డప్పు వాయిద్యాలు, బాణాసంచా పేల్చుతూ, పూలజల్లులతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఇంటి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. 2024 ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో చింత రాజనర్సింహారెడ్డి, చింతా నవజ్యోతిరెడ్డి, గ్రామ సర్పంచు శంకర్‌రెడ్డి, అనంతపురం పెద్దిరెడ్డి, జడ్‌పిటిసి శేఖర్‌రెడ్డి, లావనూరు దామోదర్‌రెడ్డి, ఏటూరు సూర్యనారాయణరెడ్డి, రామిరెడ్డిపల్లె సర్పంచు సుదర్శన్‌రెడ్డి, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు మంజూరు చేస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలను మంజూరు చేస్తామని తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట సాగుదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కౌలుదారులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు, పంటల బీమా, రైతు భరోసా వంటి ప్రయోజనాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు. ఎపి పంట సాగుదారు హక్కుల చట్టం 2019 మేరకు సంబంధిత గ్రామ సచివాలయంలో పంట సాగుదారు హక్కు పత్రాలు జారీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అవకాశాన్ని కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు.

సిబిఐటిలో జి-20 సమ్మిట్ అవగాహన సదస్సు

ప్రజాశక్తి - చాపాడు

స్థానిక సిబిఐటి కళాశాలలో బుధవారం నేసనల్ ఎడ్యుకేషన్ పాలసీ జాతీయ విద్య విధానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి సంవత్సరం ఎంబిఎ, బిటెక్ విద్యార్థులు పాల్గొన్నారు. జి-20 సమ్మిట్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ పోటీల్లో దాదాపు 232 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో మొదటి ముగ్గురు బహుమతులు సాధించారు. మొదటి బహుమతి సిఎస్‌సి విభాగానికి చెందిన జి.వాణి, రెండవ బహుమతి ఇసిఇ విభాగానికి చెందిన వి.సంధ్య, మూడవ బహుమతి సిఎస్‌సి విభాగానికి చెందిన వై.శ్వేత గెలుచుకున్నారు. విద్యార్థుల్లో జి-20 సమ్మిట్ గురించి అవగాహన కల్పించడం పట్ల కళాశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు.

చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం

పులివెందుల రూరల్ : చుక్కల భూముల సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించిందని మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, వైసిపి నాయకులు బలరాంరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం చుక్కల భూములకు సంబంధించి రైతులకు హక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని 130 మంది రైతులకు చెందిన 174.50 ఎకరాలకూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ప్రత్యేకాధికారి ఆర్‌కేశ్వరకుమార్‌రెడ్డి, డాక్టర్ ఎంవెంకటేశ్వర్లు, తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో బుధవారం వారు పులివెందుల మండల సచివాలయ ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నీటి సరఫరా పారిశుధ్యం వంటి అంశాలపై ప్రజలు సూచనలు చేయాలన్నారు. గ్రామాల్లో నాడు-నేడు పనులు, జలజీవన్, జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులు అంశాలపై సమీక్షించారు. ఎపిఎం గురురాజ్, ఎ.నాగలక్ష్మి సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'శ్రీవిద్య' ప్రభంజనం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఇంటర్ ఫలితాల్లో శ్రీవిద్య కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫలితాల్లో శ్రీవిద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపిసి, బైపిసి విభాగాల్లో పట్టణ ఫస్ట్‌గా నిలిచారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ రమణారావు, డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, రామమోహన్, దస్తగిరి అభినందించారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరుకు చెందిన జంగాల కృష్ణయ్య హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు పులివెందుల డిఎస్‌పి వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకు కృష్ణయ్య బయటికి వెళ్లి తిరిగి వస్తుండగా కాకర్ల ఉత్తమరెడ్డి, కాకర్ల గౌతమి, కాకర్ల కమలమ్మ ఆకస్మికంగా కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వెంటనే మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు. నిందితులను బుధవారం అంకాలమ్మ గూడూరు 'హెచ్‌పి పెట్రోల్ బంకు వద్ద అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ రాజు, రూరల్ సిఐ బాల మద్దిలేటి, సింహాద్రిపురం ఎస్ఐ రోషన్ ఉన్నారు.

ఇన్నోవా ఢీకొని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ముద్దనూరు

కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలోని శెట్టివారిపల్లె గ్రామ సమీపం వద్ద బుధవారం స్కూటర్‌ను ఇన్నోవా ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న దర్శేసి గుర్రప్ప (78) మృతి చెందాడు. సిఐ నరేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శెట్టివారిపల్లె గ్రామానికి చెందిన గుర్రప్ప స్కూటర్‌పై ముద్దనూరు నుంచి స్వగ్రామానికి వెళుతుండగా, తాడిపత్రి వైపు వెళుతున్న ఇన్నోవా వెనుక వైపు నుంచి ఢీ కొంది. ప్రమాదంలో గుర్రప్ప తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సిఐ తెలిపారు. గుర్రప్ప కుమారుడు కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

- నిషేధిత కాల్షియం కార్బైడ్‌తో మామిడి పండ్లను మాగపెడుతున్న వైనం

మార్కెట్లో కనిపిస్తున్న పచ్చని మామిడి పండ్లను చూస్తూనే నోరూరుతుంది.. ధరను కూడా లెక్కచేయకుండా వెంటనే వాటిని కొని తినాలనిపిస్తోంది కదా.. అయితే ఒక్క క్షణం ఆలోచించండి.. మీరు తింటున్నది స్వచ్ఛంగా మాగిన మామిడి పండ్ల కాదు.. నిషేధిత కాల్షియం కార్బైడ్‌తో వ్యాపారులు మాగ పెట్టినవని గుర్తుంచుకోండి.. ఆరోగ్యం జర జాగ్రత్త.


మాగిన మామిడి కాయలు


నిషేధిత క్యాల్షియం కార్బైడ్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

వేసవికాలం మొదలవగానే మార్కెట్లోకి కుప్పలు తెప్పలుగా మామిడిపండ్లు వచ్చిపడతాయి. వ్యాపారులు వాటిని త్వరగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో, ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీసే కాల్షియం కార్బైడ్ పెట్టి మామిడి కాయలను మాగ పెడతారు. ఇలా మాగబెట్టిన పండును తినడం వల్ల తీవ్ర అనారోగ్యానికి గురవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వ్యాపారులు తమ ఇష్టానుసారం మామిడిపండ్లను మాగబెడుతున్నారు. ఎం కార్బైడ్‌తో మాగబెడుతున్నారు. అవసరమైతే తప్ప అధికారులు వ్యాపారులపై దాడులు చేయడంలేదు. తూతూమంత్రంగా ఈ వ్యవహారం నడుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రం పండ్లను మాగ బెట్టేందుకు ఎథిలిన్ గ్యాస్ వినియోగిస్తూ, ఎసి గదులను ఉపయోగిస్తున్నారు. పచ్చి మామిడి కాయలు టన్ను రూ.45000 నుండి రూ.50వేల ధర పలుకుతుండగా, మాగ బెట్టిన పండ్ల ధర రూ.60 వేలకు పైగా ఉంది. రైతులు పచ్చి మామిడికాయలను మార్కెట్‌కు తీసుకువస్తారు. వీటిని క్యాల్షియం కార్బైడ్ వాడి త్వరగా పచ్చటి రంగుతోపాటు పండు మాగినట్లు తయారుచేస్తారు. ఈ మామిడి పండ్లు తినడం ద్వారా ప్రజలు అనేక రకాల శ్వాసకోశ వ్యాధుల బారినపడుతున్నారని సాక్షాత్తు హైకోర్టు చెప్పినప్పటికీ వ్యాపారులు పెడచెవిన పెడుతున్నారు. కాల్షియం కార్బైడ్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ ఉపయోగం లేకుండా పోతోంది. కొందరు వ్యాపారులు రహస్యంగా వారి ఇళ్లల్లో, గోదాముల్లో మామిడిపండ్లను రాశులుగా పోసి కాల్షియం కార్బైడ్‌తో మాగబెడుతున్నట్లు సమాచారం. మామిడి పండ్లే గాక అరటిపండ్లను కూడా ఈ విధానం ద్వారా మాగ బెడుతున్నారు.

కాల్షియం కార్బైడ్ నిషేధంపై ఏదీ నిఘా..

కాల్షియం కార్బైడ్‌పై నిషేధనం ఉన్నా ఫుడ్ సేఫ్టీ కంట్రోల్ అధికారులు పూర్తిస్థాయిలో నిఘా పెట్టడం లేదు. కనీసం స్థానిక అధికారులు కూడా దీనిపై దృష్టి సారించడం లేదు. మామిడి, అరటి పండ్లు, సపోటా పండ్లును కాల్షియం కార్బైడ్ వినియోగించి తమ ఇళ్ల వద్దే మాగ బెడుతున్నారు. అధికారులు ఇకనైనా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫుడ్ కంట్రోల్ శాఖలో సిబ్బంది కొరత ఉందని సమాచారం. దీన్ని ఆసరా చేసుకుని వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆ శాఖలోని ఖాళీలను భర్తీ చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న వ్యాపారస్తులపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

తల్లిదండ్రుల హృదయాల్లో చెరగని ముద్ర 'శ్రీ వెంకటేశ్వర హైస్కూల్'

- తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య.. కంప్యూటర్ ల్యాబ్, బస్సు సౌకర్యం


శ్రీవెంకటేశ్వర హైస్కూల్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఏ తల్లిదండ్రులైన పిల్లల భవిష్యత్ గురించే ఆలోచిస్తారు. ఆ క్రమంలో పిల్లల చదువుల విషయమై తల్లిదండ్రులకు మొదటగా గుర్తుకు వచ్చే పాఠశాల 'శ్రీ వెంకటేశ్వర హైస్కూల్'. ఈ పాఠశాల తల్లిదండ్రుల హృదయాల్లో అంతటి చెరగని ముద్ర వేసుకుంది. ఆ మేరకు పాఠశాల కరస్పాండెంట్ చంద్రఓబుల్‌రెడ్డి 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. 30ఏళ్లుగా విద్యారంగంలో తిరుగులేని సంస్థగా శ్రీ వెంకటేశ్వర హైస్కూల్ విరజిల్లుతోందన్నారు. పట్టణంలో 1993లో ఈ పాఠశాలను స్థాపించామన్నారు. అప్పట్లో 50 మంది విద్యార్థులతో మొదలైన పాఠశాల ప్రతి సంవత్సరం 350 మంది విద్యార్థులకు తగ్గకుండా ముందడుగు వేస్తోందన్నారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు విద్యను అందిస్తున్నామన్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఐఐటీకి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇలా శిక్షణ తీసుకున్న విద్యార్థులలో ముగ్గురు విద్యార్థులు ఐఐటీలో సీట్లు సాధించారన్నారు. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాల్లో అన్ని రంగాల్లో స్థిరపడ్డారన్నారు. ఎంతోమంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ కొలువుల్లో విదేశాల్లో ఉండగా, మరికొందరు ఇండియన్ ఎయిర్ ఫోర్సులోనూ, యూనివర్సిటీ ప్రొఫెసర్లుగానూ, ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగాల్లోనూ, బ్యాంకు ఉద్యోగాల్లోనూ, పోలీసులుగాను ఇలా అన్ని రంగాల్లో స్థిరపడినట్లు తెలిపారు. విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో అనుభవిజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతి ఫలితాల్లో ఆరుసార్లు టౌన్ ఫస్ట్ సాధించడంతోపాటు పలుమార్లు మండలం ఫస్ట్, పలుమార్లు జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులతో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారన్నారు. ప్రత్యేక స్టడీ అవర్స్ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని వివరించారు. ప్రతి నెల రెండవ శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రోగ్రెస్‌ను తెలియజేస్తామన్నారు. ప్రతిభ అవార్డులు, చెకుముకి టాలెంట్ టెస్ట్, మన ఊరి కోసం టీం నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌ల్లో విద్యార్థులకు అవార్డులు, రివార్డులు సాధించడం హర్షణీయమన్నారు. విద్యార్థులు ఆడుకొనుటకు క్రీడా మైదానం, అధునాతన సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. దూర ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యను అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. అందువల్లనే విద్యార్థుల తల్లిదండ్రుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నామన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని తెలిపారు. విద్యార్థుల కలలను 'శ్రీ వెంకటేశ్వర హైస్కూల్' ద్వారా నిజం చేసుకోవాలని తల్లితండ్రులను ఆయన కోరారు.


కరస్పాండెంట్ చంద్రఓబుల్‌రెడ్డి

జగనన్నా.. వేంపల్లె రోడ్ల దుస్థితి చూడన్నా : టిడిపి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చి నాలుగేళ్లు పూర్తయినా మండలంలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉందని, సిఎం జగన్ ఒకసారి ఇటువైపు చూడాలని టిడిపి రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డి, జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. స్థానికంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా నాలుగేళ్ల కాలంలో ఒక్క సిమెంట్ రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. బాగున్న సిసి రోడ్లను అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణాల పేరుతో పగులగొట్టి ప్రజలను ఇబ్బందులు చేశారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వాటర్ గ్రిడ్ కోసం బాగున్న సిసి రోడ్లను పగలకొట్టి గుంతలమయంగా తయారు చేయడం బాధకరమన్నారు. వీధుల్లో తీసిన గుంతల వల్ల ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రజల ఇబ్బందులను అధకార పారీ నాయకులు పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అండర్ డ్రెయినేజీ పనులకు నిధులను విడుదల చేసి త్వరితగతిన రోడ్ల నిర్మాణాలు పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు గొటూరు నాగభూషణం, మండల మైనార్టీ ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, గొల్లల గూడూరు మాజీ సర్పంచు రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చిన్నబ్బి పాల్గొన్నారు.

అట్టహాసంగా రాజన్న భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)


రాజన్న భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు, ప్రజాప్రతినిధులు

పట్టణానికి వచ్చే ప్రజలకు, పేద ప్రజానీకానికి కడుపారా రుచికరమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో రాచమల్లు రాజన్న భోజనశాలను ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగ ఏర్పాటు చేసిన భోజనశాలను బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి అట్ట హాసంగా ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ భోజన శాలను పదకొండేళ్ల నిరంతరాయంగా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నా నని తెలిపారు. త్రిటౌన్ పోలీసుస్టేషన్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో భోజన శాలను ప్రారంభించామన్నారు. వారానికి ఒకరోజు ఫ్రైరైస్, కుర్మాతో కూడిన ఆహారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు మునిరెడ్డి, వైసిపి రాష్ట్ర నాయకులు పోరెడ్డి నరసింహరెడ్డి, కాకర్ల నాగశేషారెడ్డి, ఎంపిపి శేఖర్ యాదవ్, జడ్పీటిసి అంజనికుమారి, కోనేటి సునంద, పవన్ కుమార్‌రెడ్డి, పాతకోట వంశీధర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, శివాలయం చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, గురునాథ్‌రెడ్డి, భాస్కర్, రమణయ్య, గోసా మనోహర్, మల్లికార్జున, రామమునిరెడ్డి, నరసింహరెడ్డి, కమాల్‌బాషా, ఇర్ఫాన్ బాషా పాల్గొన్నారు.

రూ.2.60కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆటోనగర్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆటోనగలో రూ.2.60కోట్లతో చేపడుతున్న పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటోనగర్‌లో రోడ్డు, కాలువలు, తాగునీరు, విద్యుత్ వంటి కనీససౌకర్యాల కల్పనకు ప్రాధాన్యతనిస్తామన్నారు. 1990లో ఆటోనగర్ ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుండి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇక్కడికి కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల నుంచి వ్యవసాయ పరికరాలు, వాహనాల రిపేర్లు కోసం వస్తుంటారన్నారు. రాబోవు వర్షాకాలంలోపు పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో నన్నే సాహెద్, కాకర్ల నాగశేషారెడ్డి, టిటిడి బోర్డు మెంబర్ మారుతి ప్రసాద్, ఆటోనగర్ అసోసియేషన్ ప్రెసిండెంట్, సెక్రటరీ, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సిసి కేడెట్లు, అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య

ప్రజాశక్తి - కడప

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధ వారం ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్‌సిసి కేడెట్లతో అవ గాహన ర్యాలీ నిర్వ హించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్ర నాథ్ ప్రారంభించారు. ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్ పాల్గొన్నారు. రక్తదాన ప్రచార సేవకుడు రాయల్ కరీముల్లాకు ప్రసంశాపత్రాన్ని ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ ఇన్‌ఛార్జి అధికారి సాయిగ్రేస్, జిల్లా వైద్యాధికారి ఖాదరవలి అభినందనలు తెలిపారు. నెహ్రూ కో-ఆర్డినేటర్ మణికంఠ, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ తేజ పాల్గొన్నారు. **బి కోడూరు :** స్థానిక బద్వేలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ రాంప్రసాద్, బద్వేల్ అడిషనల్ డిప్యూటీ డిఎంహెచ్ఒ చంద్రహాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. చాలామంది యువకులు రక్తదానం చేశారు. బి కోడూరు డాక్టర్ వినీత్‌రాజు, ఉదయ్‌కుమార్, విలియం, ఎఎన్ఎం కుమారి, ఎంఎల్‌హెచ్ రక్తదానం చేశారు. **ఖాజీపేట :** కడప నగరంలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కడప శాఖలో అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్గాడం శివశంకర్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డి, డిఎంహెచ్ఒ ఖాదరవలి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ మణికంఠ, యువజనుల సర్వీసుల శాఖ జిల్లా అధికారి, ఇండియా రెడ్ క్రాస్ సొసైటీ ప్రత్యేక అధికారి సాయిగ్రేస్ ఈ పురస్కారాన్ని అందజేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చాపాడు


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మైదుకూరు మండలం నంద్యాలంపేట సచివాలయ పరిధిలోని శ్రీరామ్‌నగర్, భాగ్యనగర్ గ్రామాల్లో బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి అందుతున సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వాటిని వివరించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని, సాగు నీరు సకాలంలో అందేలా చూస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఘనస్వాగతం లభిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం జివి సత్రం రైతు భరోసా కేంద్రంలో రైతులకు మంజూరైన పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగించే జనుము, జీలగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీమన్‌నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, వైసిపి నాయకులు నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్‌జి పల్లెలో 'గడప గడపకూ'

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని రాజుల గురువాయపల్లె (ఆర్‌జి పల్లె) గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొంటారని, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు తప్పక హాజరుకావాలన్నారు.

మండల సమావేశంలో తాగునీటి సమస్యపై చర్చ

ప్రజాశక్తి - కొండాపురం


మాట్లాడుతున్న ఎంపిడిఒ నాగప్రసాద్

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సభా భవనంలో ఎంపిపి సి.లక్ష్మిదేవి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో తాగునీటి సమస్య చర్చకు వచ్చింది. కోడూరు ఎంపిటిసి సభ్యులు రామమునిరెడ్డి మాట్లాడుతూ కోడూరు గ్రామంలో కొంత భాగం మాత్రమే నీటి సరఫరా అవుతోందన్నారు. దీనిపై సంబంధిత అధికారి మాట్లాడుతూ కోడూరు గ్రామంలో నీటి సరఫరాకు సంబంధించి అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపామన్నారు. వారి నుంచి అనుమతి వచ్చేలా చేస్తామని తెలిపారు. తాళ్ల ప్రొద్దుటూరు వైద్యురాలు రెహనాసుల్తాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాఖలో అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. రోగి ఇంటి వద్దకే వెళ్లి అవసరమైన మందులు ఉచితంగానే అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ శోభన్‌బాబు, ఎంపిడిఒ నాగప్రసాద్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

19న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్


ఐక్యత చాటుతున్న చేనేత నాయకులు

ఈ నెల 19న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టామని జయప్రదం చేయాలని ఎపి చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు, వీరనాల శివనారాయణ, కాటా రామదాసు, కొండప్ప, గుద్దేటి బాలకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఆర్అండ్‌బి అతిధిగృహంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత కార్మికులు ప్రభుత్వ, అధికారుల నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. దీంతో వారికి అప్పులు, అర్ధాకలి, ఆకలి చావులు కారణంగా అప్పులు, అర్దాకలి, ఆకలి చావులు ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు రావలసిన 11 రకాల వస్త్రాల రిజర్వేషన్ చట్టాన్ని అమలు జరపాలన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమానికి జిల్లా నలమూలల నుండి చేనేత కార్మికులు, ఉప వృత్తి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు అల్లా లక్ష్మీనారాయణ, చౌడం సంజీవరాయుడు, గంజికుంట గోవిందరాజు, శ్రీనివాసులు, మునికుమార్, బడిగింజల శ్రీనివాసులు, శివశంకర్, గోవింద, మురళీకృష్ణ, మహేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా చే గువేరా జయంతి వేడుకలు

జమ్మలమడుగు రూరల్ : చే గువేరాలోని చే అంటే ప్రశ్నించడమని డివైఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రసాద్, సహాయ కార్యదర్శి నాగేంద్ర, సుభహన్ తెలిపారు. చే గువేరా 95 జయంతి సందర్భంగా బుధవారం పాతబస్టాండ్‌లో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధక్షేత్రంలో ఏ మాత్రం భయపడకుండా దూసుకెళ్లడం ఆయన సహజ లక్షణమన్నారు. నేడు బిజెపి మతోన్మాద శక్తులను ఎదుర్కోవడానికి చే గువేరాను ఆదర్శంగా తీసుకోవాలని యువతను కోరారు. శంకర్, రాజు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో..

జమ్మలమడుగు : దేశంలోని విద్యార్థి, యువత అంతా కూడా విప్లవా వేగుచుక్క చే గువేరాను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్ కుమార్ విద్యా ర్థులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని శిరిడిసాయి జూనియర్ కళాశాలలో చే గువేరా జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో వారు మాట్లాడుతూ 39 ఏళ్ల వయసులోనే కార్మిక, కష్టజీవుల రాజ్యం కోసం చే గువేరా పాటుపడ్డారని తెలిపారు. చే గువేరా అంటే విప్లవం, చైతన్యం, ప్రశ్నించడం, సమానత్వమని వివరిం చారు. సదస్సులో సిఐటి యు మండల నాయకుడు దాసరి విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సుదర్శన్, రాజా, మున్నా, విద్యార్థులు పాల్గొన్నారు.